ఎరుపెక్కుతున్న కడవెండి

- నేడు దొడ్డి కొమురయ్య 79వ వర్ధంతి
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ రాక



కడవెండిలో అమరుల స్తూపాలను అలంకరించిన సీపీఐ నాయకులు, ఇన్‌సెట్‌లో (దొడ్డి కొమురయ్య ఊహా చిత్రం)

దేవరుప్పుల : నిజాం సర్కారు విముక్తి కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి అంకురార్పణ చేసిన దొడ్డి కొమురయ్య స్మరణంతో ఏటా కడవెండి ఎరుపెక్కుతుంది. 1946 జూలై 4వ తేదీన విస్నూర్ దేశముఖ్ గుండాలు, నిజాం సర్కారు తుపాకి గుండ్లకు బలిదానం కాబడిన తొలి అమరత్వం పొందిన కడవెండి దొడ్డి కొమురయ్య నాటి పోరాట సస్ఫూర్తిని భావి తరాలకు అందించే దిశలో సీపీఐ ఆధ్వర్యంలో ఏటా సంస్మరణ సభ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే సీపీఐ మండల కార్యదర్శి జీడి ఎల్లయ్య, రైతు సంఘం జిల్లా నాయకుడు బిల్లా తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో కడవెండి ముఖద్వారంలోని వామపక్షభావజాల పోరాట వీరులు, బొడ్రాయి వద్ద దొడ్డి కొమురయ్య, మావోయిస్టు అగ్రనేత ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి, పైండ్ల వెంకటరమణ స్మారక స్థూపాలకు ఎర్రని రంగు వేశారు.ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య వారసులుగా ఆయన పోరాట స్ఫూర్తిని నేటి తరాలు కొనసాగించేందుకు పార్టీ ఆదేశాల మేరకు సంస్మరణ సభ నిర్వహించేందుకు సన్నాహకాలు చేస్తున్నామన్నారు. తాడిత.. పీడిత ప్రజానీకం కోసం అనేక రూపాల్లో వామక్ష, సాయుధ పంథాలో అశువులు బాసిన వీరులను స్మరించుకునేందుకు కొమురయ్య సంస్మరణ సభను వేదికగా మార్చామన్నారు. ఈ సభకు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసారావు, జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి అనుబంధ రాష్ట్ర నాయకులు రానున్నట్లు వెల్లడించారు. రాజకీయాలకతీతంగా కొమురయ్య సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



నర్మెట: నర్మెట మండల నూతన తహసీల్దార్‌గా ఎండీ మొహసిన్ ముజ్తాబా గురువారం బాధ్యతలు చేపట్టారు. నర్మెటలో విధులు నిర్వహించిన కలకుంట్ల వెంకట రామానుజాచార్యులు బదిలీపై బచ్చన్నపేటకు వెళ్లగా ఆయన స్థానంలో రఘునాథ్‌పల్లి నుంచి మొహసిన్ ముజ్తాబా నర్మెటకు వచ్చారు.

రఘునాథపల్లి తహసీల్దార్‌గా ఫణి కిషోర్



రఘునాథపల్లి: రఘునాథపల్లి తహసీల్దార్‌గా ఎల్.ఫణి కిషోర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసే తహసీల్దార్ మోహ్సిన్‌ముజ్తాబా నర్మెటకు బదిలీకాగా ఆయన స్థానంలో బచ్చన్నపేట డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేసే ఫణి కిషోర్ ఇక్కడికి తహసీల్దార్‌గా వచ్చారు. బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌కు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

బచ్చన్నపేట తహసీల్దార్‌గా రామానుజాచారి



బచ్చన్నపేట: మండల తహసీల్దార్‌గా రామానుజాచారి, నాయబ్ తహసీల్దార్‌గా శంకర్‌లు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన ప్రకాశ్‌రావు నెల రోజుల క్రితమే సూర్యాపేటకు బదిలీ కాగా ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఫణికిషోర్ రఘునాథపల్లికి బదిలీ అయ్యారు. అలాగే నర్మెట తహసీల్దార్ రామానుజాచారి, రఘునాథపల్లి డీటీ శంకర్‌లు ఇక్కడకు బదిలీపై వచ్చారు.

ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా రాత్ ఖానం



జనగామ రూరల్: పట్టణంలోని అటానమస్ ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా గురువారం ప్రొఫెసర్ రాత్ ఖన్నాం బాధ్యతలు స్వీకరించారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఏబీవీ కళాశాల ప్రిన్సిపాల్‌గా వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ గతంలో ప్రిన్సిపాల్‌గా చేసిన ఎ.నర్సయ్య జూన్ 30న రిటైర్ అయ్యారు.

ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా అనిల్ ఎన్నిక

లింగాలఘణపురం: మండల ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మైలారం అనిల్ ఎన్నికయ్యారు. గురువారం మండల కేంద్రంలో జిల్లా మాజీ అధ్యక్షుడు కామని భరత్ ఆధ్వర్యంలో మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఎన్నికలను నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా దీకొండ ఉప్పలయ్య, ప్రధాన కార్యదర్శిగా పసునూరి ఉపేందర్, కోశాధికారిగా రావుల భాస్కర్, సహాయ కార్యదర్శిగా గుండు రాజశేఖర్, సభ్యులుగా వెంకటేశ్, సాయికిరన్, కృష్ణలను ఎన్నుకున్నారు.

డిగ్రీ కళాశాల విద్యార్థినుల ప్రతిభ



జనగామ రూరల్: పెంబర్తి మహాత్మా జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చూపి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సీట్లు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు పీజీ ఎంట్రన్స్, ఇతర ప్రభుత్వ పోటీ పరీక్షలకు శిక్షణ అందిస్తున్నామని, అందులో భాగంగానే శ్రావణి (బీజెడ్‌సీ), రమ్య (బి.కామ్-సీఏ) విద్యార్థులు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్‌లో ప్రతిభ కనపరిచి సెంట్రల్ యూనివర్సిటీ హైదరాబాద్‌లో సీట్లు సాధించారని చెప్పారు. ప్రతిభ కనబరిచి సీట్లు సాధించిన విద్యార్థినులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఇంద్ర, జ్యోతి అభినందించారు.

పబ్లిక్ మరుగుదొడ్లను తెరిపించండి

జనగామ రూరల్: ఐదు సంవత్సరాలుగా మూతపడి ఉన్న పబ్లిక్ మరుగుదొడ్లను తెరిపించాలని అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ కోరారు. ఈ మేరకు పట్టణంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద మూతపడి ఉన్న మరుగుదొడ్లను ఆయన సందర్శించి మాట్లాడారు. ముఖ్య సలహాదారుడు వంగ భీమ్ రాజ్, ప్రవీణ్, నరేష్ విద్యాసాగర్‌కృష్ణ, నవీన్ పాల్గొన్నారు.

టైలు, బెల్టుల పంపిణీ



స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాఠశాల సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయురాలు రుద్రమదేవి ఆధ్వర్యంలో రూ.12వేలు విలువైన టైలు, బెల్టులను పంపిణీ చేశారు. ఈ మేరకు పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం లింగమూర్తి మాట్లాడారు. విద్యార్థులు టైలు, బెల్టులు అందించిన ఉపాధ్యాయురాలు రుద్రమదేవిని ప్రత్యేకంగా అభినందించారు. అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ మంజుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పోరాటం ఆగదు

- త్వరగా కోలుకుంటున్నా..
- టెలికాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే పల్లా



టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ: శస్త్ర చికిత్స అనంతరం త్వరగా కోలుకోవడం జరుగుతుందని, ప్రజా సమస్యలపై పోరాటం మాత్రం ఆగదని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ మోహినాబాద్‌లోని తన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యే గురువారం సాగునీటి సమస్యలు, కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ, అభివృద్ధి కార్యక్రమాలు, బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతంపై పార్టీ కేడర్‌తో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. స్థానిక సమస్యలు, పరిష్కార మార్గాలు, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీసి, అవసరమైన సూచనలు, మార్గదర్శకాలను కేడర్‌కు అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ శస్త్ర చికిత్స జరిగిన తర్వాత 8 వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు చెప్పినట్లు స్పష్టం చేశారు. కోలుకున్న వెంటనే మొట్ట మొదటగా కొమురవెల్లి, అక్క డ నుంచి జనగామకు వస్తానని చెప్పారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను తహసీల్దార్ల చేతులమీదుగా పంపిణీ చేసుకోవాలని తెలియజేశారు. ఇందిరమ్మ ఇల్లు పథకాన్ని కాంగ్రెస్ కార్యకర్తలకే అందించడం దురదృష్టకరమన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్య ర్థుల ఎంపికకు వారం రోజుల్లో మండల స్థాయి నాయకులు, ఇన్‌చార్జ్‌ల అభిప్రాయం ఇవ్వాలని చెప్పారు. తాను త్వరగా కోలుకోవాలని పూజలు చేసి, తన క్షేమం కోరిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డును కమ్మేసిన చెట్ల కొమ్మల తొలగింపు



చెట్ల కొమ్మలను తొలగింపజేస్తున్న ఎస్సై నగేష్

సాక్షి ఎఫెక్ట్..

నర్మెట: రహదారిని కమ్మేస్తున్న చెట్లు శీర్షికన సాక్షిలో గురువారం కథనం ప్రచురితమైన విషయం విదితమే.. కాగా, కథనానికి స్పందించిన ఎస్సై నైనాల నగేష్ తన సిబ్బందితో కలిసి గురువారం రోడ్డును కమ్మేస్తున్న చెట్ల కొమ్మలతో పాటుగా సైడ్ బర్మ్‌లను పొక్లెయినర్‌తో తొలగించారు. హన్మంతాపురం గ్రామస్తులు, వాహనదారులు ఎస్సైకి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

'రానున్నది బీఆర్‌ఎస్ రాజ్యమే'

బచ్చన్నపేట: రాష్ట్రంలో రాబోవు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొడిగం చంద్రారెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వీసీలో పాల్గొన్న అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామ శాఖ అధ్యక్షులు, యూత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు



మాట్లాడుతున్న రాపర్తి రాజు

జనగామ రూరల్/రఘునాథపల్లి: కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయం, రఘునాథపల్లి మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయా సమావేశాలల్లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుంచు విజేందర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి భూక్య చందు నాయక్, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్య చందునాయక్, మండల కార్యదర్శి గంగాపురం మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

జఫర్‌గఢ్: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 9వ తేదీన చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఆయన కోరారు. నాయకులు నక్క యాకయ్య, నల్లతీగల శ్రీను, కాట సుధాకర్, సముద్రాల దర్గయ్య పాల్గొన్నారు.

జనగామలో శాతవాహన, కోణార్క్ రైళ్లను ఆపండి



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న రాజు, పక్కన డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి

జనగామ: జనగామ రైల్వేస్టేషన్‌లో శాతవాహన, కోణార్క్ సూపర్ ఫాస్ట్ రైళ్లను నిలపాలని కోరుతూ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ కూచన రాజు గురువారం జిల్లా కేంద్రానికి వచ్చిన భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎంపీ వెంటనే దక్షిణ మధ్య రైల్వే అధికారులకు ఫోన్ చేసి శాతవాహన, కోణార్క్ రైళ్ల హాల్టింగ్ సాధ్యాసాధ్యాలకు సంబంధించి ఆలోచన చేసి ప్రయాణికులకు సౌకర్యంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, జనగామ ఏఎంసీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ ,పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి ఉన్నారు.

పాఠశాలల బలోపేతానికి పాటుపడాలి



మొరం పోయిస్తున్న హెచ్‌ఎం వెంకటలక్ష్మి

బచ్చన్నపేట: ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పాటుపడాలని కేసిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వెంకటలక్ష్మి అన్నారు. గురువారం సొంత ఖర్చులతో పాఠశాల ఆవరణలో 15 ట్రిప్పుల మొరం పోయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఝాన్సీరెడ్డి తదితరులు

పాలకుర్తి టౌన్: ఈనెల 4వ తేదీన హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరిగే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కాంగ్రెస్ పార్టీ సభను విజయవతం చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమండ్ల ఝాన్సీరెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన నియోజవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా మల్లికార్జున ఖర్గే సభను విజయవతం చేయాలని కోరుతూ టీపీసీసీ జనరల్ సెక్రటరీ దుద్దిళ్ల శ్రీను బాబు, పల్లె శ్రీనివాస్‌గౌడ్‌లతో కలిసి కరపత్రాన్ని ఆవిష్కరించారు. నియోజవర్గ బ్లాక్, మండల అధ్యక్షులు, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

భాషోపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న శంకర్

జనగామ రూరల్: భాషోపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నామని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ములుకనూరి శంకర్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొండ యాదగిరి అన్నారు. గురువారం పట్టణంలోని దుర్గాకాలనీ సంఘ కార్యాలయంలో జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సర్వసభ్య సమావేశంలో నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొండ యాదగిరి వ్యవహరించగా, జిల్లా అధ్యక్షుడిగా కొయ్యడ వేణుగోపాల్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చౌడారం), ప్రధాన కార్యదర్శిగా జేరిపోతుల రవి(జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కంచనపల్లి)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పెంబర్తి ప్రకాశ్, మాజోజు కృష్ణమూర్తి, గౌరవ సలహాదారులుగా దయిదా రవీందర్, మహిళా ఉపాధ్యక్షులుగా బెజుగామ కళావతి, సంయుక్త కార్యదర్శిగా పుప్పాల కృష్ణమూర్తి ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు చకిలం శ్రీనివాస్, బి.కృష్ణ, పి ఎల్లయ్య, వేణుమాధవ్, యాదయ్య, నరేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

బీఎల్ఓలు బాధ్యతగా పనిచేయాలి

- ఆర్డీఓ వెంకన్న



మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్: ఎన్నికల విధులు, ఓటర్ల నమోదు తదితర కార్యక్రమాల్లో బీఎల్ఓలు బాధ్యతగా పనిచేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. స్థానిక జెడ్పీఎస్‌ఎస్‌లో బీఎల్‌ఓల (బూత్ స్థాయి అధికారులు)కు గురువారం శిక్షణ తరగతులను నిర్వహించగా ఆర్డీఓ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌ఓలు క్షేత్రస్థాయిలో బాధ్యతగా, సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ఎన్నికల విధులకు సంబంధించి వారికి పలు సూచనలు, సలహాలు అందించారు. ఓటర్ల నమోదులో బీఎల్‌ఓలదే కీలకబాధ్యత అన్నారు. అనంతరం బీఎల్‌ఓలకు నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మాస్టర్ ట్రైనర్లు రాజేందర్, నరేందర్, ఆర్ఐ శ్రీకాంత్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన ఆర్డీఓ

ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆర్డీఓ డీఎస్ వెంకన్న గురువారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి పరిసరాలు, వార్డులను పరిశీలించారు. అనంతరం డ్యూటీ డాక్టర్, వైద్య సిబ్బందితో మాట్లాడి ఆస్పత్రిలోని సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పేషెంట్లతో మాట్లాడుతూ వైద్య సేవలు ఎలా ఉన్నాయని ఆరా తీశారు.

పల్లెల్లో పీరీల సందడి

దేవరుప్పుల/బచ్చన్నపేట: కులమతాలకతీతంగా జరుపుకునే మొహర్రం పురస్కరించుకుని పల్లెల్లో పీరీల సందడి కనిపిస్తోంది. గురువారం దేవరుప్పుల మండల కేంద్రంలోని జనగామ–సూర్యాపేట రహదారి కాలనీల్లో దేవరుప్పుల, కామారెడ్డి గూడెంకు చెందిన పీరీలు(షావర్లు)ఇంటింటా తిరుగగా భక్తులు జలాభిషేకాలతో స్వాగతం పలుకుతూ షావర్లకు జట్టీలు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే బచ్చన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో పీరీలను ఇంటింటా తిప్పారు.

ఇసుక అక్రమ దందాను అరికట్టాలి

దేవరుప్పుల: మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పేరిట ఇసుక అక్రమ దందాను సత్వరమే అరికట్టాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఇసుక క్వారీలను తలపించేలా వందలాది ట్రిప్పుల ఇసుక తరలింపు, ట్రాక్టర్ యజమానులు పాల్పడుతున్న అక్రమ దందాపై తహసీల్దార్ ఆడెపు ఆండాల్‌కు వివరించారు.

విద్యారంగాన్ని కాపాడుకుందాం..



సమావేశంలో పాల్గొన్న డీటీఎఫ్ నాయకులు

నర్మెట: ప్రభుత్వ అనాలోచిత విధానాల వల్ల రోజురోజుకు బలహీన పడుతున్న విద్యారంగాన్ని కాపాడుకోవాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్ప రంగారెడ్డి అన్నారు. సభ్యత్వ నమోదె కార్యక్రమంలో భాగంగా స్థానిక ఉన్నత పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు వృత్తిపట్ల నిబద్ధతతో పనిచేసి విద్యార్థులలో, తల్లితండ్రులలో విశ్వాసాన్ని కలుగజేసి హాజరుశాతాన్ని పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బి.చొక్కయ్య, కార్యదర్శి. భూక్య శివరాం, అకడమిక్ సెల్ కన్వీనర్ దివాకర్ రెడ్డి , మండల ప్రధాన కార్యదర్శి అంజనేయులు, సభ్యులు కృష్ణ, జగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అవగాహన

చిల్పూరు: త్వరలో ఎన్నికలు వస్తున్నందున ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని శిక్షార్హులు కావద్దని జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. చిన్నపెండ్యాల గ్రామంలో గురువారం రాత్రి స్థానిక ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత, సైబర్ క్రైమ్, యాంటీ డ్రగ్స్‌పై వివరించారు.

బాధితుడి శస్త్ర చికిత్సకు 'పల్లా' హామీ

చిల్పూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న బాధితుడి శస్త్ర చికిత్సకు అయ్యే పూర్తి ఖర్చు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భరిస్తానని హామీ ఇచ్చినట్లు బీఆర్‌ఎస్ జిల్లా యువజన నాయకుడు కేశిరెడ్డి రాకేష్ రెడ్డి గురువారం తెలిపారు. వెంకటాద్రిపేట గ్రామానికి చెందిన కందుల రజిత-రమేష్‌ల కుమారుడు మధు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. విషయాన్ని గ్రామ మాజీ సర్పంచ్ కందుల రఘుపతి, చొల్లేటి రాజేశ్వశర్మలు రాకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పల్లా దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన పల్లా హైదరాబాద్‌లోని నీలిమ ఆస్పత్రిలో ఉచిత శస్త్ర చికిత్సకు ఏర్పాట్లు చేయడంతో పాటు బాధిత కుటుంబాని ఇంటి నిర్మాణానికి భరోసా ఇచ్చారని తెలిపారు.

పరామర్శ

తరిగొప్పుల: ప్రమాదవశాత్తు జారిపడి చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధికార ప్రతినిధి చిలువేరు లింగం, తాజా మాజీ సర్పంచ్ దామెర ప్రభుదాస్ గురువారం పరామర్శించారు. త్వరగా కోలుకుని నియోజకవర్గ ప్రజలకు సేవలు చేయాలని ఆకాంక్షించారు.

డైరీల అందజేత

దేవరుప్పుల: నిత్యం విద్యార్థుల ప్రగతి పట్ల తల్లిదండ్రుల భాగస్వామ్యం కోసం డైరీలను ప్రవేశపెట్టామని హెచ్‌ఎం అంబటి అంజయ్య అన్నారు. గురువారం మండలలంలోని సింగరాజుపల్లి ప్రాథమిక పాఠశాలలో స్థానిక ఉపాధ్యాయురాలు ఐలేని చైతన్య సహకారంతో 53 మందికి డైరీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో జరిగే దినచర్యను కనీస చదవు వచ్చిన కుటుంబ సభ్యులు పరిశీలించి హోమ్‌వర్క్ పూర్తి చేసేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాళ్లు మాధవి, చైతన్య, శ్రావణి, సునీత పాల్గొన్నారు.

మ్యుటేషన్ ఆపాలి

బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామంలో 707 సర్వే నంబర్‌లో మ్యుటేషన్‌ను నిలుపుదల చేయాలని పలువురు ప్లాట్ల కొనుగోలుదారులు కోరారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్ శంకర్‌కు వినతి పత్రాన్ని అందించారు. కోడూరి శివకుమార్, బీడీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



నర్మెట: మచ్చుపహాడ్‌కు చెందిన మామిడాల రాజయ్య (65) పాముకాటుతో ఇటీవల మృతిచెందాడు. కాగా మృతుడి కుమారుడి పదవ తరగతి మిత్రులు గురువారం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5 వేల సాయం అందజేశారు. గుండేటి రాంచందర్, గొల్లపల్లి రాజు, చింతకింది ప్రభాకర్, కొంపెల్లి అంబేడ్కర్, రాయారపు బాలరాజు , జడల రాజు, కనకరాజు, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

లింగాలఘణపురం: మండలంలోని జీడికల్‌లో బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ శనిగరం నర్సింహులు (52) గురువారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. నర్సింహులు బైక్‌పై వ్యవసాయ బావి నుంచి ఇంటికి వస్తుండగా జీడికల్ నుంచి ఆలేరు వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న గొలనకొండకు చెందిన బోడ ఆదర్స్ అనే వ్యక్తి ఢీకొనడంతో నర్సింహులు కిందపడి తలకు గాయాలయ్యాయి. వెంటనే జనగామలో ప్రథమ చికిత్స చేసి పరిస్థితి విషమంగా ఉండడంతో గురువారం ఉదయం హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో వ్యక్తికి జైలు

లింగాలఘణపురం: వడిచర్లకు చెందిన కానుగంటి సందీప్ బుధవారం మద్యం సేవించి వాహనం నడుపడంతో వాహనాల తనిఖీలో దొరికిన ఆయనకు జనగామ మేజిస్ట్రేట్ నాలుగు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా వాహనదారులు మద్యం సేవించి వాహనం నడుపవద్దని, హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని, లేనిచో చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

జరిమానా

దేవరుప్పుల: నిబంధనలకు విరుద్ధంగా వాగుల్లో ఇసుక రవాణాకు పాల్పడిన ఆరుగురు ట్రాక్టర్ యజమానులకు జరిమానా విధించారు. గురువారం మండల కేంద్రంలోని వాగు నుంచి పక్క మండలాలలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం అనుమతులు ఇచ్చారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్న 3 గంటల వరకు రవాణా చేయాల్సిన ట్రాక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా ఉదయం 8గంటలకే వాగులోకి దిగి ఇసుక రవాణా చేస్తున్న విషయమై సమచారం మేరకు రెవెన్యూ, పోలీసులు మూకుమ్మడిగా పట్టుకున్నారు. సదరు ఆరు ట్రాక్టర్లపై కేసు నమోదు చేసి తహసీల్దార్ ఆండాళ్‌కు అప్పగించగా జరినామా వేసినట్టు ఎస్సై ఊర సృజన్‌కుమార్ తెలిపారు.